andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 • కనిష్ఠం 21.8



మాజీ సర్పంచ్‌ల సమరభేరి



గ్రామ పంచాయతీలో రోడ్డు నిర్మాణం (ఫైల్)

పూర్ణచందర్ గౌడ్, మాజీ సర్పంచ్, పెంబి (ఫైల్)

- పెండింగ్ బిల్లుల కోసం ఇక మాజీ సర్పంచ్‌ల ఉధృత ఉద్యమం
- జిల్లా, మండల, గ్రామస్థాయిలో వరుస ఆందోళనలు
- సర్కారు స్పందించకుంటే రాబోయే ఎన్నికలను అడ్డుకుంటామంటాని హెచ్చరిక
- బిల్లులు రాక అప్పుల బాధ
- ప్రాణత్యాగాలు చేసుకుంటున్నా పట్టించుకోరా అని ధ్వజం

నిర్మల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు ఇక ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటి వరకు బిల్లులు రాకపోతుండడం పట్ల వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలాసార్లు వివిధ రూపాల్లో పెండింగ్ బిల్లుల కోసం ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనుల కోసం లక్ష్యాలను నిర్దేశించి నిర్దేశిత గడువులోగా పనులు చేయాలంటూ హెచ్చరికలు జారీ చేసిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ తరువాత చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా సర్పంచ్‌లను అనేక రకాల ఇబ్బందులకు గురి చేసింది. కొంతమంది సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు పెద్దమొత్తంలో అప్పులు సైతం చేశారు. అప్పులకు సంబంధించిన వడ్డీల బాధలు తాళలేక కొంతమంది సర్పంచ్‌లు అప్పట్లో ఆత్మహత్యలకు, ఆత్మహత్య యత్నాలకు పాల్పడ్డ సంగతి తెలిసిందే. అయితే సర్పంచ్‌లు ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపైనే తమ బిల్లులకు సంబంధించి ఆశలు పెట్టుకున్నారు. ఏడాది నుంచి తమకు బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు ఆందోళనలు చేస్తూ వస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం సర్పంచ్‌లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామంటూ హామీ కూడా ఇచ్చింది. ఆ హామీ నెరవేరకపోతుండడంతో ఇక మళ్లీ తమ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు మాజీ సర్పంచ్‌లు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే సోమవారం వారు జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నాకు దిగారు. ప్లకార్డులు ప్రదర్శించి తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. బిల్లులను చెల్లించి మాజీ సర్పంచ్‌ల ఆత్మహత్యలను నివారించాలని ఫ్లకార్డుల ప్రదర్శన చేశారు. బిల్లులు చెల్లించనట్లయితే రాబోయే సర్పంచ్ ఎన్నికలను అడ్డుకుంటామంటూ ఫ్లకార్డులను ప్రదర్శించి స్పష్టం చేశారు. జిల్లాస్థాయి నుంచే కాకుండా గ్రామ, మండల స్థాయిల్లో కూడా ఇక మాజీ సర్పంచ్‌లు బిల్లుల కోసం పెద్ద ఎత్తున ఉద్యమించాలని నిర్ణయించారు. ఉద్యమానికి సంబంధించిన షెడ్యూల్‌ను సైతం ఒకటి రెండు రోజుల్లో రూపొందించి ఇక తమ పోరుబాటను మొదలుపెట్టబోతున్నారు. గతంలో సర్పంచ్‌లు వివిధ రకాల పథకాల కింద పెద్దఎత్తున అప్పులు చేసి పనులను చేపట్టారు. పనుల పూర్తికి టార్గెట్‌లు విధించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులను మాత్రం విడుదల చేయలేదు. దీంతో కుప్పలు తెప్పలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. గత నాలుగేళ్ల నుంచి సర్పంచ్‌లు బిల్లుల కోసం గళమెత్తినప్పటికీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి డిమాండ్‌ను పట్టించుకోలేదు. అంతలోనే ఎన్నికలు రావడం, బీఆర్ ఎస్ పార్టీ ఓడిపోవడంతో ఆ బిల్లుల భారమంతా ప్రస్తుత కాంగ్రెస్ సర్కారుపై పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం బిల్లులు చెల్లిస్తామంటూ హామీనిచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఆ హామీ నెరవేరకపోవడంతో జిల్లాలోని మాజీ సర్పంచ్‌లంతా ఇక తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు.

వివిధ పథకాల కింద..

కాగా అప్పటి సర్పంచ్‌లు తమ తమ గ్రామ పంచాయతీల్లో వివిధ పథకాల కింద అభివృద్ధి పనులు చేపట్టారు. మనఊరు - మనబడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామ పంచాయతీ పరిధిలోని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే టీఎస్ఈడబ్ల్యూ ఐడీసీ ద్వారా కూడా పాఠశాలల్లో పనులు నిర్వహించారు. ఎస్‌డీఎఫ్ కింద కూడా బిల్లులు రావాల్సి ఉందంటూ పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం సర్పంచ్‌లు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను ఇప్పటి వరకు శాఖల వారీగా విడుదల చేయకపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. సర్పంచ్‌లు ఇక బిల్లుల కోసం శాఖల వారీగా కాకుండా సామూహికంగా ఆందోళనలు చేపట్టనున్నారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా బాధిత సర్పంచ్‌లంతా ఇక తాడోపేడోకు సిద్ధమవుతున్నారు.

శాఖల వారీగా పెండింగ్ బిల్లులు..

కాగా పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 50 పనులకు సంబంధించి మొత్తం రూ.10 కోట్ల వరకు బకాయిలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే రోడ్డు భవనాలశాఖ పరిధిలో 20 పనులకు చేపట్టగా రూ.2కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. బిల్లులు రాకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోతున్నాయి. నిర్మల్ మున్సిపాలిటీలో రూ.10కోట్ల బకాయిలున్నాయి. టీఎస్ఈడబ్ల్యూ ఐడీసీ ద్వారా ముథోల్, భైంసా మండలాల్లో మొత్తం 38 పనులకు గానూ రూ. 16 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిధుల నుంచి రూ. 8 కోట్ల విలువైన పనులను చేపట్టినప్పటికీ దాదాపు రూ.3 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కుభీర్ మండలంలో 24 పనులు మంజూరు కాగా అందులో నుంచి 22 పనులను పూర్తి చేసినప్పటికీ రూ.1.23కోట్ల బిల్లుల బకాయిలున్నట్లు పేర్కొంటున్నారు. ఈ పనులన్నీ మన ఊరు - మన బడి పథకం కింద గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించారు. అలాగే ఎస్‌డీఎఫ్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద చేపట్టిన పనులకు సంబంధించి కూడా బిల్లులు విడుదల కావడం లేదు. దీంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆందోళన కలిగిస్తున్న సంఘటనలు

కాగా తమ గ్రామాల్లో పరువు నిలుపుకునేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయపోయినప్పటికీ అప్పటి సర్పంచ్‌లు మాత్రం అభివృద్ధి పనులను అప్పులు చేసి పూర్తి చేశారు. అయితే ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోతుండడంతో మాజీ సర్పంచ్‌లను చేసిన అప్పుల బాధలు వెంటాడాయి. దీంతో కొంతమంది ఆత్మహత్య యత్నాలకు సైతం పాల్పడిన సంఘటనలు అందరిని కలిచివేస్తున్నాయి. వారం రోజుల క్రితం పెంబి మండల సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ అప్పుల బాధల కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన ఉదాంతం పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తోంది. సదరు మాజీ సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ ఎస్ఎఫ్‌సీ, ఎస్‌డీఎఫ్, మన ఊరు - మన బడికి సంబంధించిన రూ. 17.40 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సదరు మాజీ సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటనతో మాజీ సర్పంచ్‌లు సైతం ఇక తాడోపేడోకు సిద్ధం కావాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఇక ఆందోళన బాటకు శ్రీకారం చుట్టనున్నారు.

మమ్మల్ని క్షమించండి మేడం

- ఆర్డీవోకు దిలావర్‌పూర్, గుండంపల్లి మహిళల వేడుకోలు



ఆర్డీవో రత్నకల్యాణి ఛాంబర్‌లో దిలావర్‌పూర్, గుండంపల్లి మహిళలు

దిలావర్‌పూర్/నిర్మల్ కల్చరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ పోరాటంలో భాగంగా పలుమార్లు ఆర్డీవో రత్న కళ్యాణిని అడ్డుకున్న దిలావర్‌పూర్, గుండంపల్లి మహిళలు సోమవారం ఆర్డీవోను కలిసి క్షమాపణ కోరారు. ఇథనాల్‌కు వ్యతిరేకంగా నవంబరు 26వ తేదీన జాతీయ రహదారిపై ధర్నా చేపట్టిన మహిళలతో మాట్లాడేందుకు వచ్చిన ఆర్డీవో రత్న కళ్యాణిని సుమారు 8 గంటల పాటు మహిళలు నిర్బంధించారు. దీంతో ఆర్డీవో అస్వస్థతకు గురికావడంతో ఎస్పీ జానకి షర్మిల ఆమెను ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. అయితే ఆ మరునాడు సర్కార్ స్పందించి ఇథనాల్ పరిశ్రమ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆర్డీవోను ఇబ్బంది పెట్టినందుకు తీవ్ర మనోవేదనకు గురైన మహిళలు సోమవారం ఆర్డీవోను కలిసి మీకు ఇబ్బంది కలిగించినందుకు మమ్మల్ని పెద్ద మనసుతో క్షమించు మేడం అంటూ ఆర్డీవోను వేడుకున్నారు. పూల మొక్క అందజేసి, శాలువాతో సన్మానించారు.

ఆష్టలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం

తానూర్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 2 : ముధోల్ మండలంలోని ఆష్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 3వ తేది మంగళవారం నుంచి 5వ తేదీ గురువారం వరకు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమం మాధవానంద సరస్వతీ స్వామి చేతుల మీదుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి రోజు శ్రీరామచంద్రుడి అభిషేకం, రెండవరోజు గణపతి పూజ కుటీర హోమం గోపూజ యాగశాల ప్రవేశం, శ్రీరామచంద్రుడి ఉత్సవ విగ్రహాలతో అంగరంగ వైభవంగా పద్మశ్రీ కనకరాజు బృందం గోసాడి నృత్యంతో బాజా భజంత్రీలతో శోభాయాత్ర ఉంటుందన్నారు. చివరిరోజు శ్రీ రామ మందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని, నియోజక వర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాలు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలి : డీఈవో

సోన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలని నిర్మల్ డీఈవో రామారావు అన్నారు. సోమవారం నిర్మల్‌లోని వెంగ్వాపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రార్థన చేయించి నైతిక విలువల పట్ల అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. ఆయనతో పాటు హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో

ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు

- వర్చువల్ విధానంలో నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాల కార్యక్రమం నిర్వహించారు. వర్చువల్ పద్ధతిలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను మంత్రులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ప్రారంభించగా, స్థానికంగా జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రారంభించుకోవడం సంతోషకరమైన విషయమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతస్థానంలో నిలిచి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్తులో పేద ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కళాశాలలోని అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటూ చక్కగా విద్యను అభ్యసించాలన్నారు. నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేసినందుకు విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శకుంతల, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఎస్ఎంసీ నోడల్ అధికారి సునీల్, తహసీల్దార్ రాజు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్, కుమార్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భైంసా డివిజన్‌కు మూడు కొత్త 108 అంబులెన్స్‌లు

- బాసర, తానూర్, కుభీర్ మండలాలకు కేటాయింపు
- పూర్తిగా మెరుగుకానున్న అత్యవసర సేవలు



కొత్త 108 అంబులెన్స్ వాహనం

భైంసా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో క్షతగాత్రులను తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ సేవలు భైంసా డివిజన్ పరిధిలో పూర్తిస్థాయిలో మెరుగుకానున్నాయి. డివిజన్ పరిధిలో ఏడు మండలాలు ఉండగా ఇది వరకు 3 వాహనాలు మాత్రమే ఉన్నాయి. కుంటాల, భైంసా, ముథోల్ కేంద్రాల ద్వారా 108 అంబులెన్స్ వాహనాలు సేవలు అందేవి. రెండు మండలాలకు కలిపి ఒక్కో వాహనం సేవలు లభించేవి. దీంతో కొన్ని సందర్భాల్లో అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందకుండా పోయేవి. సంబంధిత సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో 213 కొత్త 108 అంబులెన్స్ వాహనాలను ప్రారంభించారు. ఇందులో భైంసా డివిజన్‌కు మూడు మంజూరు చేశారు. . జిల్లా అధికారులు వీటిని బాసర, తానూర్ , కుభీర్ మండల కేంద్రాలకు కేటాయించారు డివిజన్ పరిధిలో ఇది వరకు మూడు 108 అంబులెన్స్ వాహనాలు ఉండగా కొత్తగా మరో మూడు వాహనాలు జత అవ్వడంతో ఏడు మండలాల్లో 6 వాహనాల ద్వారా అత్యవసర సేవలు అందుబాటులోకి రానున్నాయి. వాహనాల సంఖ్య పెరగడంతో క్షతగాత్రులు, ప్రసవవేదనతోనున్న గర్భిణులకు, ఇతర ఆరోగ్య సమస్యలతో అస్వస్థత చెందిన వారిని ఆసుపత్రులకు సకాలంలో తరలించేందుకు మార్గం సుగమమయ్యింది.

సమావేశాన్ని బహిష్కరించిన ఉపాధ్యాయ సంఘాలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా సోమవారం డీఈవో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఐక్య ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించాయి. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ఏర్పాటు చేసి నాలుగు గంటల వరకు రాకపోవడంతో డీఈవో పట్ల నిరసన వ్యక్తం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగిఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించిన ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల సహాయార్థమై జిల్లాలో నాలుగు ఎయిడ్స్ నిర్ధారణ, కౌన్సిలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల కోసం ఉచిత మందులతో పాటు ఆసరా పెన్షన్ అందించి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి అధికంగా ప్రబలే అవకాశం ఉన్న ప్రత్యేక వర్గాలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, బాధితులకు సత్వర చికిత్స అందించాలని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించేందుకు అవసరమై మెడికల్ సదుపాయాలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హెచ్ఐవీ వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అందరూ ఈ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని సమాజాన్ని ఆరోగ్యవంతంగా మార్చడంలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ర్యాలీ సందర్భంగా కళాకారులు డప్పు పాటలతో ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, తహసీల్దార్లు, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులను సమర్పించారు. ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీతగడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అధికారులంతా శాఖల వారీగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 6న రాష్ట్ర విద్యా కమిటీ జిల్లాలో పర్యటించనుందని తెలిపారు. సీఎంకప్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో జరిగిన జాతీయ ఆర్చరీ పోటీల్లో వెండి పతకం సాధించిన విద్యార్థులను సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు. కడెం మండలం అల్లంపల్లి జియ్యర్ గురుకుల పాఠశాలకు చెందిన పి. జగన్, ఎం. హరిడం, శశివర్ధన్‌లు అండర్- 14 విభాగాల్లో పతకాలు సాధించారు. గిరిజన సంక్షేమ అధికారి జే. అంబాజీ, డీఈవో రామారావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, ప్రిన్సిపాల్ శాంతారాం, స్పోర్ట్స్ అధికారి భూక్యా రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

హామీల అమలులో ప్రజలకు కాంగ్రెస్ వెన్నుపోటు

- రేవంత్ సర్కార్ పనితీరుపై ధ్వజమెత్తిన ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ చార్జిషీట్ విడుదల



భైంసాలో కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై చార్జ్‌షీట్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ తదితరులు

భైంసా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు అనేక రకాల గ్యారంటీల హామీలనిచ్చి వాటిని అమలుపరచడంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజానీకానికి వెన్నుపోటు పొడిచిందని ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన వైఫల్యాలపై సోమవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ ఆధ్వర్యంలో చార్జ్‌షీట్ విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసపూరిత విధానాలతో పాలన కొనసాగిస్తున్నాడని ధ్వజమెత్తారు. హామీల అమలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకు రోజుకో కొత్త నాటకానికి తెరలేపుతూ కాలయాపన విధానాలను అవలంభిస్తున్నాడని దుయ్యబట్టారు. హైడ్రా పేరిట పేదల ఇళ్లు కూలగొట్టి బడుగు, బలహీన వర్గాల ప్రజానీకానికి తీరని అన్యాయం చేసారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన అంటూ ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో రేవంత్‌రెడ్డి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం పేరిట గత ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి చేస్తే హైడ్రా, మూసి ప్రక్షాళన పేరిట రేవంత్ రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి సీటులో కూర్చునే అర్హత లేదని తక్షణమే తన పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్ల పేరిట రేవంత్ సర్కార్ ప్రజా వంచనకు పాల్పడుతోందన్నారు.

- మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిపై మండిపడ్డ ఎమ్మెల్యే పాటిల్

మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాయమాటలతో నియోజక వర్గ వాసులకు మోసం చేస్తున్నారని ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ మండిపడ్డారు. దశాబ్ద కాలంగా ఎమ్మెల్యేగానున్న సమయంలో నియోజక వర్గ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరి ప్రగతికి అంకితమవుతానని పేర్కొనడం హాస్యస్పదంగా ఉందన్నారు. తన పదవీ కాలంలో గుండేగాం పునరావాసం, బాసర అభివృద్ధి, కాళేశ్వరం ప్యాకేజీ పనులు ఎందుకు చేపట్టలేదో నియోజక వర్గ వాసులకు వివరించాలని డిమాండ్ చేశారు. ఇందులో ప్రోగ్రాం కన్వీనర్ రాజేష్ బాబు, జిల్లా సహ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర్ నారాయణరెడ్డి, గోపాల్ సర్దాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆకాశంలో మబ్బులతో తగ్గుముఖం పట్టిన చలి

నిర్మల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం చల్లి తగ్గుముఖం పట్టినట్లు కనిపించింది. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో జిల్లాలో చలితీవ్రత తగ్గింది. వారం రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా విపరీతమైన చలితో ఇబ్బంది పడ్డ ప్రజలకు వాతావరణంలో చోటుచేసుకున్న ఈ మార్పులు ఉపశమనాన్ని కలిగించాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రం చల్లటి గాలులు వీస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వాహనదారులతో పాటు బస్సులు, టాటా మ్యాజిక్ లాంటి వాహనాలలో ప్రయాణించే ప్రయాణికులు సైతం చల్లటి గాలులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ చల్లటి గాలుల తీవ్రతను తట్టుకునేందుకు ప్రజలు వెచ్చటి దుస్తులను ఉపయోగించడమే కాకుండా చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. దీనికి తోడు హోటళ్లలో ఉదయం, సాయంత్రం వేళల్లో వేడివేడి ఛాయ్ తాగడం, వేడి తినుబండారాలను తినడంపై పలువురు మక్కువ చూపుతుండడంతో హోటళ్లలో సందడి కనిపిస్తోంది. జిల్లావ్యాప్తగా అత్యల్పంగా 21 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సమస్యలపై ఆదివాసీ గిరిజన సంఘం ధర్నా

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం వైఎస్ఆర్ కాలనీలోని రాంజీగోండు ఏరియా ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆదివాసీ సంఘం ధర్నా చేపట్టింది. జిల్లా కార్యదర్శి తొడసం శంభు మాట్లాడుతూ... వీధి దీపాల ఏర్పాటు, రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించాలని పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆనంద రావు, సుజాత, సూర్యభాను, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో క్లాత్‌మర్చంట్ దగ్ధం



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్

ఖానాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లోని జీప్ అడ్డాలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ బట్టల దుకాణం దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే సోమవారం రాత్రి ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... పాత బస్టాండ్‌లోని కేసరి ఫ్యాషన్స్ అనే బట్టల దుకాణం రాత్రి యధావిధిగా మూసేసి షాప్ యజమాని రాజేందర్ ఇంటికి వెళ్లిపోయాడు. కాగా 10 గంటల సమయంలో షాప్‌లో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో షాప్‌లో ఉన్న బట్టలతో సహా పర్నిచర్ సైతం దగ్ధమైనట్లు ఎస్సై పేర్కొన్నారు. చుట్టు పక్కల వారు మంటలను గమనించి విద్యుత్‌శాఖతో పాటు ఫైర్‌ఇంజర్‌కు సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను ఆర్పినట్లు పేర్కొన్నారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ. 10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

862 కిలోల గంజాయి దహనం



గంజాయి దహనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో 14 కేసుల్లో పట్టుబడ్డ 862 కిలోల గంజాయి దహనం చేసినట్లు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద గల శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్ వద్ద గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గంజాయి దహనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీసీఆర్బీ డీఎస్పీ బి.సురేందర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, డీసీఆర్బీ ఎస్సై హకీం పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం : బీజేపీ

ఇంద్రవెల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులతో ఆరు గ్యారంటీలపై కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరుగ్యారంటీలు అన్‌గ్యారం టీలుగా మిగిలిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కిచ్చిన వాగ్దానాలు, హామీలు నెరవేర్చడంలో విఫలం చెందిందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలన్నారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగం, మాజీ జడ్పీటీసీ పుష్పలత, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు రాథోడ్ రాధిక, నాయకులు మోరే దిలిప్, మాస్కే రాజవర్ధన్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

భీంపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్ కోటిలో జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పాఠశాల విద్యార్థులు పర్యావరణాన్ని రక్షించాలని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పర్యావరణ కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూధన్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

'బోరు రిపేరు చేయించండి'

తాంసి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పక్షం రోజులుగా బోరు చెడిపోయింది. దీంతో అక్కడి కాలనీవాసులకు తాగునీటి ఇబ్బంది నెలకొందని అక్కడి కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించినా చర్యలు చేపట్టడం లేదని పేర్కొన్నారు. బోరును రిపేరు చేయించాలని కాలనీవాసులు కోరు తున్నారు.

ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించే స్టాపర్స్ అందజేత

ఇచ్చోడ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు గ్రామీణ కుట మైక్రోఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారి సహాయార్థం మండల కేంద్రంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు స్టాపర్లను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్, సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి, మైక్రోఫైనాన్స్ మేనేజర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే ఏజెన్సీలో వలసలు

ఉట్నూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతర్లకు ఇండ్లు కట్టుకునే అవకాశం లేకున్నా, పంచాయతీ అధికారుల కొందరి అక్రమాల వల్ల ఏజెన్సీలో వలసలు పెరిగిపోతున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి రామారావు, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు మడావిమనోహర్‌లు తెలిపారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిసి పంచాయతీ కార్యదర్శులపై ఫిర్యాదు చేశారు.

కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ

తలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటుకు అభిప్రాయాన్ని సేకరించారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉమ్మడి ఝరి గ్రామ పంచాయతీ పరిధిలోని అను బంధ గ్రామాలైన టోకిగూడ, షేర్‌గూడ ఆదివాసీ అనుబంధ గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయని, కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమని ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథ నం వచ్చింది. దీంతో స్పందించిన అధికారులు సోమ వారం ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఈవో సుధీర్‌రెడ్డి, మండల సర్వేయర్ ప్రవీణ్, ఝరి గ్రామ పంచాయితీ సెక్రటీ అశోక్‌లు గ్రామాన్ని సందర్శించి గ్రామసభ ఏర్పాటు చేసి రెండు గ్రామాల ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా షేర్‌గూడ, టోకిగూడ గ్రామాల పటేళ్ళు జన పటేల్ సకారం గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం కూడా లేదన్నారు. రెండు గ్రామాలను కలిపి కొత్త గ్రామ పంచాయితీ ఏర్పాటు చేస్తే ఆదివాసీ గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఈవో సుధీర్‌రెడ్డి, పంచాయితీ సెక్రటరీ అశోక్, గ్రామ పటేల్ జనక్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

ఫుడ్‌పాయిజన్ ఘటనలో బీఆర్‌ఎస్ కుట్ర

● కాంగ్రెస్ జిల్లా నాయకులు గిమ్మసంతోష్

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి):వసతి గృహాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలు బీఆర్‌ఎస్ కుట్ర కోణమని కాంగ్రెస్ జిల్లా నాయకులు గిమ్మసంతోష్ ఆరోపించారు. సోమవారం ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సంక్షేమ హాస్టళ్ల కార్యదర్శిగా పని చేసిన ప్రస్తుత ఆ పార్టీ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈ కుట్రకు సూత్రధారి అని ఆరోపించారు. అప్పట్లో ఫుడ్ కాంట్రాక్టు, వర్కర్స్‌ను నామినేట్ పద్ధతిలో నియమించడంతో ప్రస్తుతం ఆ సిబ్బంది అంతా ఇంకా ఆయన కంట్రోల్‌లోనే ఉన్నారని తమ ప్రభుత్వాన్ని బద్నాం చేసి రాజకీయ లబ్ధి పొందే కుట్రలో భాగంగా ఈ తతంగమంతా జరుగుతుందని మండిపడ్డారు. విద్యార్థుల సంక్షేమాన్ని కాంక్షించే తమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యకు ఎనలేని ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. ఇందులో నాయకులు దొగ్గల రాజేశ్వర్, మహిళ నాయకురాలు శ్రీలేఖ, బుర్లశంకరయ్య, దాసరి ఆశన్న, శ్రీరామ్, ప్రశాంత్, సదాలి రామన్న, నరిగి ఆశణ్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నేరడిగొండ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులను ఉద్దేశించి మండల విద్యాధికారి భూమారెడ్డి మాట్లాడుతూ మెను ప్రకారం భోజనం అందించాలని అన్నారు. మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించని పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు మధ్యాహ్న భోజన కార్మికుల పై చర్యలు తప్పవన్నారు. అలాగే వంట చేసే సమయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, మండల ఎంఐఎస్ అనిల్, సీఆర్‌పీలు రవీందర్, వినోద్, సురేందర్‌లు పాల్గొన్నారు.

పశువులకు తప్పనిసరిగా టీకా వేయించాలి

బజార్‌హత్నూర్, డిసెంబర్ 02 : మండల కేంద్రంలోని ప్రతి రైతన్న తమ పెంపుడు జంతువులన్నింటికీ తప్పనిసరిగా గాలి కుంటూ టీకాలను వేయించాలని పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పశువులకు టీకాలు వేసేందుకు పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రైతులు తమ పశువులను పశువైద్యశాలకు తీసుకువచ్చి గాలికుంటు నివారణ టీకాలను వేయించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ మాట్లాడుతూ రైతులు తమ పెంపుడు జంతువులకు ముందు జాగ్రత్తగా ఎటువంటి వ్యాధులు దరి చేరకుండా ఉండేందుకే ఈ టీకాలను వేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ టీకాలన్నీ ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. వైద్య సిబ్బంది మీ ఇంటి వద్దకే వచ్చి ఈ టీకాలను వేస్తారన్నారు.

జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో క్రీడా పోటీలు

ఉట్నూర్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడాపో టీలను నిర్వహించారు. 9, 10 తరగతి బాలికల మధ్య ఖోఖో పోటీలు రసవత్తరంగా జరిగాయి. కార్యక్రమంలో ఫిజికాల్ డైరెక్టర్ ఉపేందర్, ఉపాధ్యాయులు రాజ్ కుమార్, బానోత్‌ఆత్మరామ్‌లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏల ధర్నా

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవో నంబర్ 81 ప్రకారం 61 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలని వీఆర్‌ఏ జేఏసీ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. 2020 సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్‌ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయండి : ఎంపీడీవో

తలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యా న్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో వివిధ క్రీడల్లో ఆసక్తి కలిగిన క్రీడాకారులందరినీ క్రీడా పోటీల్లో పాల్గొనే విధంగా చూడాలన్నారు. ఈనెల 7, 8వ తేదీల్లో గ్రామ స్థాయి 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై అంజమ్మ, డిప్యూటీ తహ సీల్దార్ ప్రభాకర్, ఆయా పాఠశాలలకు చెందిన క్రీడా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

సిరికొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చీఫ్ మినిస్టర్స్ కప్ -2024 క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయా లని తహసీల్దార్ తుకారం సంబంధిత అధికా రులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, మండల స్థాయిలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తుకారం మాటాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులతో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్ -2024 క్రీడా పోటీలను నిర్వహిం చనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ సంతోష్, డీటీ ఉపేందర్, ఎంఈఓ సునిల్ పాల్గొన్నారు.

బోథ్ : ఈనెల 7 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని క్రీడాకారులను సన్నద్ధం చేయాలని ఎంపీడీవో రమేష్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యా లయంలో ఎంపీడీవో అధ్యక్షతన జరి గిన సమా వేశంలో మండల విద్యాధికారి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ ఆయా పాఠశాలల పీఈటీతో సమావేశం నిర్వహించారు. యువతి యువకుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

ఆరబెడితే అధిక ధర

(5వ పేజీ తరువాయి)

అధికారులు చెబుతున్నారు. పెరుగుతున్న కొనుగోళ్లు ప్రారంభంలో సీసీఐ కొనుగోళ్లు మందకోడిగానే సాగిన నెలరోజుల తర్వాత ఊపందుకుంటున్నాయి. పత్తిలో తేమ తగ్గుముఖం పట్టడం కొనుగోళ్లు పెరగడానికి అసలు కారణమని తెలుస్తోంది. 8 నుంచి 12 శాతం ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తోంది. ఇప్పటివరకు 19, 678 మంది రైతుల నుంచి 4లక్షల 15వేల 966 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది.ఆపైగా తేమ ఉన్న పత్తిని అధికారులు నిరాకరిస్తున్నారు. గంటల వ్యవధిలోనే తేమలో మార్పులు కనిపించడంతో రైతులు నష్టపోతున్నారు. మార్కెట్లో ఒకరకంగా పత్తి జిన్నింగ్ వ్యాపారుల వద్ద మరోరకంగా తేమను చూపడంతో రైతులు అయోమ యానికి గురవుతున్నారు. పత్తిని మార్కెట్‌కు తరలించే క్రమంలో రైతులు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే తేమలో తేడాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. వదులుగా తీసుకొచ్చిన పత్తిలో తేమ తక్కువ అదే తొక్కి తీసుకొచ్చిన పత్తికి ఎక్కువగా తేమశాతం వస్తున్నట్లు అధికారుల పరిశీలనలో తెలుస్తుంది. అయితే వాహనాల్లో ఎక్కువ పత్తిని తరలించేందుకే రైతులు ఈ విధంగా పత్తిని తీసుకొస్తున్నట్లు తెలుస్తుంది. మొత్తానికి గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం పత్తిలో తేమ భారీగా పడిపోవడంతో సీసీఐ కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి.

ధరల్లో భారీగా కోతలు...

తేమ నిబంధనలు పత్తి రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తేమ పేరిటా వ్యాపారులు ధరల్లో కోతలు పెడుతున్నారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. చిన్నపాటి మెలకువలు పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పత్తిని ఏరిన వెంటనే మార్కెట్‌కు తరలించకుండా ఆరబెడితే ఆశించిన ధర వచ్చే అవకాశం ఉందంటున్నారు. ప్రారంభంలో కొంతమంది రైతులు ఆదరబాదరగానే అమ్మేసుకున్న ప్రస్తుతం పెట్టుబడి ఖర్చులు తగ్గుముఖం పట్టడంతో మద్దతు ధరకే అమ్ముకునేందుకు ఆరాట పడుతున్నారు. జిల్లాలో 8 నుంచి 25 తేమ శాతం ఉన్న పత్తి మార్కెట్‌కు వస్తుంది. దీంతో ఒక్కో పాయింట్‌కు రూ.75రూపాయల చొప్పున ధరల్లో కోతలు విధిస్తున్నారు. అంటే 8 తేమ శాతం ఉన్న పత్తికి మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు రూ.7521 దక్కుతుంది. ఆపైగా తేమ ఉంటే ధరల్లో కోతలు పెడుతున్నారు. ఇలా 25తేమ శాతం ఉన్న పత్తికి రూ.5727 ధర దక్కుతుంది. కేవలం తేమతోనే ధరల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తుంది. ఇలాంటి విషయాలను పరిగణలోకి తీసుకొని రైతులు ఆరబెట్టి నాణ్యమైన పత్తిని విక్రయిస్తే అధిక ధర పొందే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లో పలు ప్రైవేట్ ఆస్పత్రులను సంఘం సభ్యులతో కలిసి సందర్శించి వివరాలు సేకరించారు.

ఈనెల 5 వరకు సోయాబీన్ కొనుగోళ్లు పూర్తి

బోథ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని రైతులు తమ వద్ద నిలువ ఉంచుకున్న సోయాబీన్ పంటను ఈనెల 5వ తేదీ లోపు మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సెంటర్ ఇన్‌చార్జి గోలిస్వామి తెలిపారు. ఆ తరువాత కొనుగోలు జరగవని పేర్కొన్నారు. కాగా నవంబరు 30 వరకు 28,4503 క్వింటాళ్ళ సోయాబీన్ పంటను 1686 మంది రైతుల వద్ద బోథ్ మార్కెట్ యార్డులో 11,671 క్వింటాళ్ళ సోయాబీన్ కొనుగోలు జరుగక 715 మంది రైతులు పంటను తీసుకువచ్చారని మార్కెటింగ్ కార్యదర్శి విఠల్ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై కళాజాతా

బోథ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్ వద్ద సోమవారం కళాజాత బృందం వారు ప్రదర్శన ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా ఏడాదిలో చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ కళాకారులు ప్రదర్శన ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో పేద ప్రజలకు అందు తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

పెండింగ్ డబ్బులు చెల్లించిన తరువాతే సర్వేలు చేయించాలి

● ఆశావర్కర్ల డిమాండ్

నిర్మల్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్లు గతంలో నిర్వహించిన సర్వేలకు సంబంధించి పెండింగ్ డబ్బులు చెల్లించిన తరువాతే కొత్తగా సర్వేలు చేయించాలని ఆశావర్కర్ల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షురాలు బి.సుజాత, ప్రధాన కార్యదర్శి పి.గంగామణి మాట్లాడుతూ... పల్స్‌పోలియో, లెప్రసీ సర్వే డబ్బులు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన జిల్లా అధికారులు డబ్బులు రాలేదంటూ చెల్లించడం లేదన్నారు. ఇతర జిల్లాల్లో చెల్లించారన్నారు. ఆర్థికంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. నాయకులు కమల, కవిత, శారద, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులంటే భయపడద్దు

కుంటాల, డిసెంబరు, 2: (ఆంధ్రజ్యోతి) : పోలీసులంటే భయపడద్దని కుంటాల ఎస్సై భాస్కరాచారి అన్నారు. సోమవారం మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మాడల్ పాఠశాల విద్యార్థులు పాఠ్యాంశంలో భాగంగా కుంటాల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. కుంటాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు ఎస్సై భాస్కరాచారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు మొదలుకొని కోర్టులో హాజరు పరిచేవరకు తీసుకునే అంశాలపై ఆయన విద్యార్థులు వివరించారు. చట్టాలు, న్యాయం గురించి అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను విద్యార్థులకు చూయించారు. స్థానిక ఉపాధ్యాయులు, రాజు, నరేష్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌ను సందర్శించగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కల్పించారు.

అటవీ సంరక్షణ మనందరి బాధ్యత

పెంబి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అటవీ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎఫ్‌ఆర్‌వో రమేష్ రావు అన్నారు. సోమవారం మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అటవీ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అటవీని నిప్పు నుంచి కాపాడుటకు అందరూ సహకరించాలని, అటవీప్రాంతంలో ఎవరైనా నిప్పు పెట్టినట్లయితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఆర్‌వో ప్రతాప్ నాయక్, ఎఫ్‌బీవోలు స్రవంతి, శ్రీనివాస్, ఆశిష్ గంగారాం, లాలాజీ, ఎంపీవో రత్నాకర్, పంచాయతీ సెక్రటరీ పద్మ, తదితరులు ఉన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి

కుభీర్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 2 : పశుపోషణలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి విశ్వజీత్‌పాటిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రత్యేక పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులున్నారు.

పెండింగ్ బిల్లుల కోసం కలెక్టరేట్‌లో సర్పంచ్‌ల ధర్నా

● నిర్లక్ష్యం చేస్తే ఎన్నికలు అడ్డుకుంటాం

నిర్మల్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదు సంవత్సరాలుగా తాము చేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని నిర్మల్ జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచ్‌లు ధర్నాకు దిగారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించలేదని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇప్పటికే కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని, గత వారం పెంబి మాజీ సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసి ప్రాణాలతో బయటపడ్డాడని వారు గుర్తు చేశారు. వెంటనే సర్పంచ్‌లకు చేసిన అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ పథకాల కింద మంజూరైన అభివృద్ధి పనులకు నిధులు వస్తాయన్న ఆశతో తాము అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల్లో తమను గెలిపించిన ప్రజల ఆశలను వమ్ము చేయకుండా ఉండాలన్న ఆలోచనతో తమ ఆస్తులను అమ్మి గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తే ప్రభుత్వం తమను మోసం చేసిందని ఆరోపించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, మన ఊరూ మన బడి, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ తదితర బడ్జెట్ కింద తాము పనులు చేపడితే ఇప్పటివరకు చిల్లిగవ్వ కూడా రాలేదని దీంతో బాకీల పాలై సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదయ్య గౌడ్, నాగయ్యలు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లు ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యల దారిన పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సర్పంచ్‌లను తీవ్రంగా మోసం చేసిందని ఆరోపించారు. కేంద్రం నుంచి వచ్చిన డబ్బులను వివిధ పథకాలకు మళ్లించి సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే సర్పంచ్‌ల ఎన్నికలను తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. రాజకీయాలకతీతంగా రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ పదవులు చేసిన వారంతా ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని వెంటనే ఇచ్చేందుకు కలెక్టర్లను ఆదేశించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వినోద్, ఉపాధ్యక్షుడు వీరేష్, సభ్యులు రామ్‌రెడ్డి, ముత్యంరెడ్డి, భూమేష్, గంగాధర్, దత్తు, శ్రీనివాస్, గోవింద్‌రాజ్, గంగారెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టరేట్ ఎదుట పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన చేస్తున్న తాజా మాజీ సర్పంచ్‌లు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం : బీజేపీ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మాయ మాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాదైనా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బీజేపీ నాయకులు ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ వైఫల్యాలపై చార్జ్ షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు రావుల రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ... రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని, రైతుబంధు విడుదల చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించలేదని, విద్యార్థుల చదువుకోసం ఇస్తానన్న సహాయం అందించ లేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానన్న మాట తప్పారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి, లంచగొండితనం విలయతాండవ చేస్తోందన్నారు. అధికారులు, నాయకులు కుమ్మక్కై ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి మంచి ఉద్దేశ్యంతో కేంద్రం అనుమతిస్తే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు తప్పుడు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారి చర్యల వల్లనే రైతులు ఆందోళనకు దిగారన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాన్ని పాలించే అర్హత కోల్పోయిందన్నారు. వైఫల్యాలపై బీజేపీ సమర శంఖారావం పేరుతో నియోజకవర్గాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. నాయకులు మేడిసెమ్మె రాజు, రాజేందర్ రెడ్డి, భూపతిరెడ్డి, పి. గణేష్, శ్రావణ్‌రెడ్డి, ఆడెపు సుధాకర్, కౌన్సిలర్ నరేందర్, బిట్లింగ్ నవీన్, అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన కేసులో ఒకరికి జైలు

ఖానాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బైండోవర్ ఉల్లంఘించిన కేసులో ఒక మహిళకు జైలుశిక్ష విధించినట్లు సోమవారం ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌రావు, ఎస్సై అభిషేక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఖానాపూర్ మండలం రాంరెడ్డి పల్లె గ్రామానికి చెందిన అజ్మీరా సునీత గతంలో గుడుంబా విక్రయిస్తే పట్టుబడగా ఖానాపూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ బైండోవర్ నిబంధన ప్రకారం తిరిగి గుడుంబా విక్రయిస్తూ పట్టుబడితే రూ. లక్ష జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష విధించబడుతుందన్నారు. కాగా సోమవారం మళ్లీ సదరు మహిళ నాటు సారా విక్రయిస్తూ పట్టుబడడంతో ఖానాపూర్ తహసీల్దార్ ఆదేశాల మేరకు అజ్మీరా సునీతను ఆదిలాబాద్ జైలుకు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. నాటు సారా తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.



అజ్మీరా సునీతను ఆదిలాబాద్ జైలుకు తరలిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బాధితులకు అండగా సీఎంఆర్‌ఎఫ్

భైంసా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) ; వివిధ కారణాలతో అనారోగ్యం పాలై ఆసుపత్రుల్లో చికిత్స లు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ పేర్కొన్నారు. సోమవారం భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ వివరాల కోసం బాధిత కుటుంబాలు భైంసాలోని తమ క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ముథోల్, భైంసా, తానూర్, కుంటాల, లోకేశ్వరం మండల్లాలోని బాధిత కుటుంబాలకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సభ్యత్వ కోఆర్డినేటర్ సుష్మారెడ్డి, బీజేపీ ప్రతినిధులు రమణరావు, వెంగల్‌రావులతో పాటు పలువురు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ట్రిపుల్ ఐటీలో ముగిసిన రిఫ్రెషర్ కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ విద్యాసంస్థల నుంచి వచ్చిన నిపుణులు

బాసర, డిసెంబరు 2 : (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీలో రిఫ్రెషర్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ట్రిపుల్‌ఐటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ రీసెర్చ్ చండీగడ్ సంయుక్తంగా నిర్వహించిన ఆ కార్యక్రమం గత నెల 19వ తేదీ నుంచి సోమవారం వరకు జరిగింది. ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో వచ్చిన అత్యాధునిక అంశాలను చర్చించారు. ఐఐటీ, ఎన్ఐటీల,సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వచ్చిన నిపుణులు పాల్గొని మెటీరియల్ సైన్స్, ప్రపోజల్ రైటింగ్, ఫిజిక్స్‌లో ఏఐటూల్స్, మాన్యుస్క్రిప్ట్ రైటింగ్, నానోమెటీరియల్లలో అనుకరణ సాధనాలు గురించి ఈ కార్యక్రమంలో వివరంగా విశ్లేషణ జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రణధీర్, డీన్ డా పావని, హెచ్‌వోడి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు



భైంసాలో టూకే రన్‌లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్

భైంసా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) ; మున్సిపల్ కేంద్రమైన భైంసాలో సోమవారం ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో టూ కే రన్ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి నిర్మల్ క్రాస్ రోడ్ వరకు నిర్వహించిన టూ కే రన్‌లో మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో పాటు ఉద్యోగ, యువజన సంఘాల శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నాయి. అనంతరం బస్టాండ్ ఎదుట ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాత బృందం అవగాహన కల్పించి ప్రదర్శనలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ గౌరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీష్‌తో పాటు వివిధ విభాగాల ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మామడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో సుశీల్‌రెడ్డి అన్నారు. సోమవారం మామడ మండలంలోని న్యూ సాంగ్వి కస్తూరిబా బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలోని వంటగది, వంటసామాగ్రి, భోజనశాలను పరిశీలించారు. మండల పంచాయతీ అధికారి గంగాసాగర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి జ్యోతి ఉన్నారు.



సుభాష్ నగర్‌లో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం

రోడ్డుపై స్తంభం.. ప్రమాదకరం!

ఇచ్చోడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీ మీసేవ సమీపంలో ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. నూతనంగా నిర్మించిన సీసీ రహదారి నిర్మాణం పై నూతనంగా అమర్చిన విద్యుత్తు స్తంభం నుంచి విద్యుత్ తీగలను ఏర్పాటుచేశారు. నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసినప్పటికీ పాత స్తంభాన్ని తొలగించడం మరిచిపోయారు. రోడ్డుపై రెండు స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. పాత స్తంభాన్ని తొలగించకపోవడంతో రాత్రుళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పల్సి(కె)లో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గణేష్‌రెడ్డి

తలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం పల్సి(కె) గ్రామంలో విఠల రుక్మాబాయి ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలను సోమవారం మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడారులను ప్రోత్సహించేందుకు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా గ్రామంలో నిర్మించిన విఠల రుక్మాబాయి ఐదో వార్షికోత్సవం గ్రామంలో ఈ నెల 2 నుంచి 5 వరకు ప్రతిరోజు అధ్యాత్మిక కార్యక్రమం, హరినామ జపం, సద్గురువుల ఉపన్యాసాలు, యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అదేవిధంగా గ్రామంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలకు మహారాష్ట్ర తెలంగాణ ప్రాంతాల నుంచి దాదాపు 70 మంది క్రీడా జట్లు పాల్గొంటాయన్నారు. అదేవిధంగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్నివిధాలుగా సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాయిల్, మాజీ ఎంపీపీ కల్యాణ లక్ష్మీ రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకట్, గ్రామ పటేల్ రామ లక్ష్మణ్, ఇందిరా ప్రియదర్శిని, యూత్ సభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను సక్రమంగా నిర్వహించాలి: ఎంపీడీవో

తాంసి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించే గ్రామస్థాయి క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి పీఈటీలు, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ పోటీలను నిర్వహించాలని అన్నారు. ఎంపిక పోటీల విషయంలో కఠిన నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

భారీగా గంజాయి పట్టివేత



బాబా నాయక్ తండా వ్యవసాయ క్షేత్రాల్లో గంజాయి మొక్కలను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి షర్మిల



నిర్మల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

- మంగల్ సింగ్ తండాలో వ్యవసాయం మాటున గంజాయి సాగు
- స్వయంగా రంగంలోకి దిగిన నిర్మల్ జిల్లా ఎస్పీ
- రూ.70 లక్షల విలువైన గంజాయి మొక్కలు స్వాధీనం
- ఆరుగురి అరెస్ట్

ఖానాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోత) : కడెం మండలంలో భారీగా గంజాయి మొక్కలు పోలీసులు పట్టుకున్నారు. వ్యవసాయం మాటున గంజాయి మొక్కలను సాగు చేస్తున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. రహస్య సమాచారం మేరకు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల తన బృందంతో కలిపి నిర్వహించిన తనిఖీల్లో ఈ గంజాయి మొక్కల సాగు వెలుగులోకి వచ్చింది. అధిక ఆదాయం అర్జించడమే లక్ష్యంగా ఈ గంజాయిని సాగు చేసిన ఆరుగురు వ్యక్తులు కటకటాల పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపిన కథనం ప్రకారం... కడెం మండలంలోని అల్లంపల్లి, బాబా నాయక్ తండా గ్రామాల్లో వాహనం కూడా వెళ్లలేని అడవుల్లోని తమ వ్యవసాయ క్షేత్రాల్లో కొంత మంది గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలకు రహస్య సమాచారం అందింది. ఈ రహస్య సమాచారం మేరకు సోమవారం డీఎస్పీ ప్రభాకర్, ఖానాపూర్ సీఐ సైదారావు, కడెం ఎస్సై కృష్ణసాగర్, ఆర్ఎస్సై రవి కుమార్, జిల్లా డాగ్స్ సిబ్బంది సాయి, సీసీఎస్ సిబ్బంది తిరుపతి, గణేష్, సతీష్, హెడ్ కానిస్టేబుల్ కైలాస్, కానిస్టేబుల్ భీమ్ రావు, ఫారుక్ తదితరుల బృందంతో కలిసి ఆమె కడెం మండలం అల్లంపల్లి, బాబా నాయక్ తండా, మంగళ సింగ్ తండా గ్రామాల శివారు ప్రాంతాల్లో గల వ్యవసాయ క్షేత్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అల్లంపల్లి పరిసర ప్రాంతాల్లోని బాబా నాయక్ తండా గ్రామ శివారులోని టకాడ ఇందల్ అనే వ్యక్తి తన తండ్రి వ్యవసాయ క్షేత్రంలో పత్తి, కంది పంటలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీకి వెళ్లిన పోలీసులను చూసి తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేసిన ఇందల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తనతో పాటు గ్రామంలో మరికొంత మంది గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు పోలీసులకు తెలిపాడు. తనతో వస్తే వారి వ్యవసాయ క్షేత్రాలను కూడా చూపుతానని చెప్పిన ఇందల్ గ్రామంలోని కాశావత్ సజన్‌లాల్, గోతి రవీందర్, కచ్చికాడ్ సంతోష్, బామనే సురేందర్, పెలియా ప్రతాప్ సింగ్ అనే ఐదుగురు గంజాయి సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను చూపించాడు. దీంతో వారందరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు వారు సాగు చేసిన గంజాయి మొక్కలను జప్తు చేశారు. కాగా ఇందల్ వ్యవసాయ క్షేత్రంలో 48.64 కిలోల బరువు గల 83 గంజాయి మొక్కలు, కాశావత్ సజన్‌లాల్ వ్యవసాయ క్షేత్రంలో 400 గ్రాముల బరువు గల గంజాయి మొక్కలు, గోతి రవీందర్ వ్యవసాయ క్షేత్రంలో 2.53 కిలోల బరువు గల 8 గంజాయి మొక్కలు, కచ్చికాడ్ సంతోష్ వ్యవసాయ క్షేత్రంలో 3.49 కిలోల బరువు గల 16 గంజాయి మొక్కలు, బామనే సురేందర్ పొలంలో 3.29 కిలోల బరువు గల 16 గంజాయి మొక్కలు, పెలియా ప్రతాప్ సింగ్ పత్తి చేనులో 4.08 కిలోల బరువు గల 20 గంజాయి మొక్కలను గుర్తించి వాటిని జప్తు చేసినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. జప్తు చేసిన పూర్తి గంజాయి మొక్కల విలువ రూ. 70 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయిని సాగు చేసిన ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి గంజాయిని పూర్తిస్థాయిలో తరిమి కొడతామన్నారు. యువత గంజాయికి బానిస కావద్దన్నారు. గంజాయి సాగు చేసిన, ఉపయోగించిన కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరిం చారు. సమష్టి కృషితో గంజాయిని తిరిమికొడదామని ప్రజలకు ఎస్పీ పిలుపునిచ్చారు. గంజాయి సాగు చేస్తునన, ఉపయోగిస్తున్న వారి గురించి తమకు వివరాలను అందజేస్తే వారి వివరాలను రహస్యంగా ఉంచుతామన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేస్తున్న గంజాయిని వెలికి తీసేందుకు శ్రమించిన పోలీసు బృందాన్ని ఆమె అభినందించారు. గంజాయి సాగు చేస్తున్న, వినియోగిస్తున్న వారి వివరాలను పోలీసు లకు తెలిపేందుకు ఫోన్ నెంబర్ 87126 59555, 87126 59599కు సమా చారం అందించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

రెండు లక్షల దాక పూర్తి.. రుణమాఫీ అసంపూర్తి

- జిల్లాలో 20 శాతం రైతులకు అందని రుణమాఫీ
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో గందరగోళం
- ఆందోళనలో రైతన్నలు

బాసర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రధానమైన వ్యవసాయ రుణమాఫీకి కోసం రైతన్నలకు ఎదురు చూపులు తప్పడంలేదు. ఇప్పటికే మూడువిడతల్లో రుణమాఫీ చేసిన ప్రభుత్వం నాలుగో విడత నిధులను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా రైతుపండుగ కార్యక్రమంలో సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి నాలుగవ విడత రుణమాఫీ నిధులను విడుదల చేశారు. అయితే వివిధ కారణలతో మాఫీరాని రైతన్నలు ఈ జాబితాలోనైనా పేర్లు లేకపోవడంతో చాలామంది రైతన్నలు నిరాశకు లోనయ్యారు.

జిల్లాలో ఇంకా 25 శాతం పెండింగ్

రూ లక్ష, రూ లక్షన్నర, రూ రెండు లక్షల వరకు ఉన్న వ్యవసాయ రుణాలను వరుసగా మూడు విడతల్లో ప్రభుత్వం మాఫీచేస్తూ వచ్చింది. తాజాగా మూడు విడతల్లో రేషన్ కార్డు లేకపోవడం వంటి వివిధ కారణాలతో తప్పిపోయిన రూ.2 లక్షలలోపు రుణం ఉన్న రైతులకు నాలుగో జాబితాలో చోటు కల్పించారు. ఒక్క కుటుంబంలో ఒక్కరికి కాని కుటుంబ సభ్యుల వ్యవసాయ రుణమొత్తం రూ.2లక్షల కంటే ఎక్కువ ఉన్న వారందరివి పెండింగ్ ఉంచారు. జిల్లాలో మొత్తం వ్యవసాయ రుణ రైతులు 110000 మంది ఉన్నారు. నాలుగు విడతల్లో 71565 మంది రైతులు రూ 658.67 కోట్ల విలువ రుణాలు మాఫీ అయ్యాయి. మిగతా మూప్పై వేల పైచిలుకు రైతుల్లో పదివేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. అంటే జిల్లాలో నాలుగో విడత తర్వాత సైతం 28 వేల మంది రైతులు ఇంకా రుణమాఫీ అందలేదు.

సీఎం ప్రకటనతో రైతుల్లో ఆందోళన

ఎన్నికల సమయంలో హామీఇచ్చినట్లు రూ. 2లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ సంపూర్ణం చేశాం అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో వ్యాఖ్యానించినట్లు ప్రధాన మీడియాలో వార్తలు రావడంతో రైతన్నల్లో ఆందోళన మొదలైంది. రైతులు మండల స్థాయి అధికారుల చుట్టూ తిరుగుతున్నారు మరో విడత రుణమాఫీ ఉంటుందని మాత్రం వ్యవసాయశాఖ ఆధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



బాసరలో రైతు పండుగ కార్యక్రమాన్ని తిలకిస్తున్న రైతులు

చాలామంది రైతులకు రాలేదు..

● గంగా శ్యామ్ బాసర



నాలుగు విడతలు పూర్తి అయినా ఇంకా చాలా మంది రైతులకు రుణమాఫీ రాలేదు. అధికారులకు అడిగినా కారణాలు చెప్పడం లేదు. ఒక ఇంట్లో ఇద్దరు.. ముగ్గురు రుణ రైతులు ఉంటే కనీసం ఒక్కరికి కూడా రాలేదు. ప్రభుత్వం చెప్పినట్లు రైతులందరి రుణాలు మాఫీ చేయాలి.

ఇప్పటివరకు 71 వేల మంది రైతులకు మాఫీ..

● అంజీప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ ఆధికారి

జిల్లాలో మొత్తం రైతులు ఒకలక్ష పదివేల మంది ఉన్నారు. వీరిలో 71 వేల మంది రైతులకు నాలుగు విడతల్లో రుణమాఫీ వచ్చింది. రూ రెండు లక్షల లోపు రుణం ఉన్న వారందరికీ ఈ నాలుగు విడతల్లో అయింది. అంతకంటే ఎక్కువ ఉన్న రైతులకు రావాల్సి ఉంది.







కనీసం బోర్డులు లేని ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు

ప్రైవేట్ భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు!

బోథ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు బోర్డు లేకపోవడంతో ఎక్కడ ఉన్నాయో ఆ భవనాలు అనే విషయం బోథ్ పట్టణ వాసులకే తెలియకుండా ఉంది. ఏడీఏ కార్యాలయం ఏర్పాటై దాదాపు ఏడాది కాలం పూర్తికావస్తున్నా ఇప్పటికీ బోర్డు ఏర్పాటు చేయలేదు. ఇక ఈ ఏడాది నూతనంగా ఏర్పాటైన ఎస్టీ బాలుర ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్‌కు సైతం బోర్డును ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ కోసం వెతుకులాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా ఎస్టీ బాలికల వసతి గృహం సైతం ప్రైవేట్ అద్దె భవనంలో నిర్వహిస్తున్న అక్కడ కూడా కనీసం బోర్డు లేకపోవడంతో హాస్టళ్ల కోసం వెంపలరాడక తప్పడం లేదు. జిల్లా అధికారులు బోర్డులు లేని కార్యాలయాలకు వద్ద సరైన బోర్డులు ఏర్పాటు చేసినట్లయితే భవనాలను గుర్తించే ఆస్కారం ఉంది.

సౌదీ వెళ్లి.. కనుమరుగై

● ఎడారి దేశంలో మూడేళ్లుగా అదృశ్యం ● ఇంటి పెద్ద రాక కోసం ఆరేళ్లుగా కుటుంబ సభ్యుల ఎదురుచూపులు

● తమకు సహాయం చేయాలని కనిపించిన ప్రతీ ఒక్కరికి వేడుకోలు ● అయినా అందని సహాయం ● ఇండియన్ ఎంబసీ చొరవ చూపాలని వేడుకోలు

ఖానాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ పోషణకై బ్రతుకుతెరువును వెతుక్కుంటూ ఎడారి దేశానికి వలస వెళ్లిన ఓ గల్ఫ్ కార్మికుడు మూడేళ్లుగా ఎక్కడ ఉన్నాడో తెలియక అతని కుటుంబ సభ్యులు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదు... తన భర్త ఆచూకీ కోసం సహాయం అందించాలని అతని భార్య... తమ తండ్రి జాడ తెలిసేలా సహకరించాలని అతని పిల్లలు కనిపించిన ప్రతి నాయకుడికి, అధికారికి ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం దక్కలేదు. దీంతో మూడేళ్లుగా తమ కుటుంబ పెద్ద ఆచూకీ కోసం ఆ కుటుంబం దీనంగా రోధిస్తున్న ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం గోడలపంపు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... గోడలపంపు గ్రామానికి చెందిన సంగం మల్లయ్య, భూదవ్వ దంపతుల కుమారుడు సింగం రాజేశ్వర్ అనే వ్యక్తి 2018 సెప్టెంబరు 18వ తేదీన బ్రతుకుతెరువు కోసమై సౌదీ దేశంకు వలస వెళ్లాడు. అప్పటి నుండి మూడేళ్ల పాటు ఖర్జూర తోటలో పని చేస్తున్నట్లు తన కుటుంబానికి తెలిపిన రాజేశ్వర్ మూడు సంవత్సరాల పాటు తమ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో సంభాషించేవాడు. కాగా 2021 సెప్టెంబరు 11వ తేదీ నుంచి రాజేశ్వర్ నుంచి కుటుంబ సభ్యులకు ఎటువంటి ఫోన్ రాలేదు. దీంతో కొన్నాళ్లు వేచి ఉన్న రాజేశ్వర్ కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం సౌదీలో ఉన్న తమ ప్రాంతం వాసులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఇక్కడ చేసిన ప్రయత్నాలతో ఎట్టకేలకు రాజేశ్వర్ రూమ్‌లో ఉండే ఖానాపూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్ నెంబర్ తెలుసుకుని అతనికి ఫోన్ చేయగా ఇంటికి డబ్బులు పంపిస్తానని నాలుగు నెలల జీతంతో కలిసి రూమ్ నుంచి రాజేశ్వర్ బయలుదేరాడని తిరిగి ఇప్పటివరకు రూమ్‌కు రాలేదని ఆయన పేర్కొన్నారు. దీంతో రాజేశ్వర్ పని చేస్తున్న యజమాని ఆచూకీ తెలుసుకొని అతనికి ఫోన్ చేసి అడగగా సౌదీ ప్రభుత్వం నిబంధనల ప్రకారం తమ వద్ద పని చేసేందుకు వచ్చి బయటకు వెళ్లిపోయిన వారి వివరాలను పోలీసులకు తెలియజేయాల్సి ఉంటుందని రాజేశ్వర్ తన వద్ద నుండి బయటకు వెళ్లగానే ప్రభుత్వానికి ఆయన వివరాలను తెలియజేసి పాస్‌పోర్ట్‌ను అప్పగించానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. తనకు మరోసారి ఫోన్ చేసి విసిగిస్తే మీపై సైతం పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో బెదిరించినట్లు రాజేశ్వర్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. రాజేశ్వర్ ఆచూకీ కోసం తమకు సహాయం చేయాలని కోరుతూ ఇప్పటి వరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా, ప్రస్తుత ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి జాన్సన్ నాయక్‌తో పాటు తెలంగాణ సచివాలయంలో సైతం సంప్రదించినట్లు రాజేశ్వర్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సింగం రాజేశ్వర్‌కు భార్య లక్ష్మీ, కూతురు మౌనిక, కుమారుడు సిద్ధార్థ, మల్లికార్జున్‌లు ఉన్నారు. తమ కుటుంబాన్ని పోషించేందుకు ఎడారి దేశానికి వలస వెళ్లిన తన భర్త మూడేళ్లుగా ఆచూకీ లేకుండా పోవడంతో కుటుంబ భారమంతా తనతో పాటు తన పెద్ద కుమారుడు సిద్ధార్థపై పడిందని రాజేశ్వర్ భార్య లక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన భర్త ఏ పరిస్థితుల్లో ఉన్నాడో ఎక్కడ ఉన్నాడో తెలియక నిత్యం పుట్టెడు దుఃఖంతో జీవితాన్ని వెల్లదీస్తున్నట్లు లక్ష్మీ ఆవేదన వ్యక్తం చేస్తోంది. తన భర్త ఆచూకీ తెలిపేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరుతోంది.



తల్లితో కలిసి చేతులు జోడించి వేడుకుంటున్న రాజేశ్వర్ కుమారులు



రాజేశ్వర్ (ఫైల్)

ఆచూకీ కోసం ఆరా తీయాలి..

● స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఖానాపూర్ మండలం గోడలపంపు గ్రామానికి చెందిన సింగం రాజేశ్వర్ ఆచూకీ కోసం ఇండియన్ ఎంబసీ ద్వారా ఆరా తీయాలి. గత మూడేళ్లుగా రాజేశ్వర్ ఎక్కడ ఉన్నాడో ఏ స్థితిలో ఉన్నాడో తెలియక ఆ కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతోంది. తమ సంఘం ద్వారా సైతం సౌదీలోని సోషల్ వర్కర్స్‌కి సమాచారం అందించి మా ప్రయత్నాన్ని మేము చేస్తున్నాం. అయినప్పటికీ అంతపెద్ద దేశంలో రాజేశ్వర్ ఆచూకీ తెలుసుకోవడం ప్రభుత్వ సంస్థలకు తప్ప ప్రైవేట్ వ్యక్తులకు సాధ్యపడక పోవచ్చు. భారత ప్రభుత్వం చొరవ చూపి రాజేశ్వర్ ఆచూకీ కోసం ఇండియన్ ఎంబసీ ద్వారా ప్రయత్నం చేయాలని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ తరఫున డిమాండ్ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి


andhrajyothy.com

సోమవారం ఉష్ణోగ్రత గరిష్టం 29.4। కనిష్టం 21.2

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

మంగళవారం 3 డిసెంబరు 2024



కేజీబీవీలో గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ, నవంబరు, 2(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని కేజీబీవీ ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థినులకు నర్సింగ్ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ టీచర్ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రత్యేక అధికారిణి జి.మల్లిక ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌సీ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ చేసిన ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 4 లోపు కళాశాలలో దరఖాస్తులను సంప్రదించాలని ఆమె ఈ ప్రకటనలో పేర్కొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

నాణ్యమైన భోజనం వడ్డించాలి

● ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్

తాంసి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ అన్నారు. సోమవారం తాంసిలోని ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించి, మెనూప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరాతీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయనతో పాటు నాయబ్ తహసీల్దార్ జాదవ్, గణేష్, ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, వార్డెన్, హరీష్‌లు ఉన్నారు.

పులి లేదు.. భయపడొద్దు

● అటవీ శాఖ అధికారి శిలానంద్

నార్నూర్, డిసెంబర్2 (ఆంధ్రజ్యోతి): నార్నూర్, గాదిగూడ మండలంలో ఎక్కడ కూడా పులి లేదని ఉట్నూర్ అటవీ శాఖ అధికారి శిలానంద్ అన్నారు. సోమవారం నార్నూర్ మండలం తాడిహత్నూర్ గుంజల నాగల్కొండా తదితర గ్రామాల్లో పులి ఉందని ప్రచారం జరగడంతో హుటాహుటిన అధికారుల బృందం వెళ్లి పంటపొలాల్లో పులిజాడను చూశారు. గ్రామాలు తిరిగిన తర్వాత ఎక్కడ కూడా పులి అడుగులు, ఇతర ఆనవాళ్లు కనిపించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా నాగల్కొండా గ్రామంలో అధికారి శిలానంద్ మాట్లాడుతూ ఉమ్మడి మండలంలో 15 రోజుల క్రితం చౌర్గావ పరిసర ప్రాంతాల్లో ఉండేదని, అది వెళ్లిపోయిందన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతంలో పులిలేదని, అనవసరంగా పులి ఉందని రైతులకు ఇబ్బంది కలిగేలా ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానం ఉన్నా, పులి ఆనవాళ్లు కనిపించినా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. తప్పుడు సమాచారంతో ప్రజల్ని ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరు కూడా అపోహలను నమ్మవద్దు అని ఆయన పేర్కొన్నారు. అలాగే పొద్దున 10 గంటలకు పనికి వెళ్లి సాయంత్రం 5గంటల లోపు తిరిగి ఇంటికి రావాలని ఆయన సూచించారు. వారి వెంట అధికారులు గ్రామస్థులున్నారు.



ఆరబెడితే అధిక ధర!

- జిల్లా పత్తి రైతులకు ప్రోత్సాహకం
- ఊపందుకున్న సీసీఐ కొనుగోళ్లు
- ఆదరబాదరగా అమ్ముకుంటూ నష్టపోతున్న పత్తి రైతులు
- రైతుల్లో అవగాహన కల్పిస్తే మరింత మేలు

ఆదిలాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగు చేస్తున్న పంటలలో పత్తి పంటదే పెత్తనం అన్నట్లుగా కనిపిస్తోంది. పత్తి పంట సాగుకు జిల్లా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో ఎక్కువగా రైతులు పత్తి పంటనే సాగు చేస్తున్నారు. దీంతో ఏటా రికార్డు స్థాయిలో పత్తి దిగుబడులు చేతికి వస్తున్నాయి. కానీ ఆశించిన స్థాయిలో ధర రాకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రతీ యేటా పత్తి కొనుగోళ్ల సమయంలో రైతులు ఆందోళనలకు, నిరసనలకు దిగడంతో అధికారులకు పెద్ద సవాలుగానే మారుతుంది. గత రెండు మూడేళ్ల క్రితం రూ.9వేల నుంచి రూ.10 వేల వరకు ధర పలికిన పత్తి ఈ ఏడాది రూ.8వేలను దాటి ధర పలుకడం లేదు. పత్తికి మద్దతు ధర కనీస స్థాయిలోనే పెరగడంతో ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఈ యేడు జిల్లా వ్యాప్తంగా 4లక్షల 34 వేల ఎకరాలలో పత్తి పంట సాగు కాగా సుమారుగా 30 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు చేతికి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు ప్రైవేట్, సీసీఐ కలుపుకొని 25వేల 645 మంది రైతుల నుంచి 5లక్షల 23వేల 882 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. బయటమార్కెట్లో పత్తికి ధర పడిపోవడంతో సీసీఐ కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. అయిన తేమ నిబంధనలతో మద్దతు ధర కొందరికే అన్నట్లుగా కన్పిస్తోంది. ఆరబెడితేనే అధిక ధర దక్కడంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

మద్దతును మించి ధర

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్తిని ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్న రైతులకు మద్దతును మించిన ధర దక్కుతోంది. నిబంధనల ప్రకారం 8 నుంచి 12 తేమ శాతం ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తోంది. ఆపైగా తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేసేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. దీంతో గత్యంతరం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారస్థులను ఆశ్రయిస్తూ తక్కువ ధరకే అమ్మేసుకుంటున్నారు. అయితే కొంతమంది రైతులకు అదనంగా ప్రోత్సాహకం (ఇన్సెంటివ్) దక్కిన దాఖలాలు కూడా కన్పిస్తున్నాయి. జిల్లాలో 6, 7 తేమ శాతం ఉన్న పత్తికి అదనంగా నగదు ప్రోత్సాహకం ఇవ్వడంతో మద్దతు మించి ధర పలుకుతోంది. ఒక్కో తేమ పాయింట్‌కు అదనంగా రూ.75 చొప్పున కలిపి చెల్లిస్తున్నారు. దీంతో 6తేమ శాతం ఉన్న పత్తికి రూ.7596 ధర పలుక గా అదే 7తేమ శాతం ఉన్న పత్తికి రూ.7671 ధర పలికింది. ఇలా జిల్లావ్యాప్తంగా 2343 మంది రైతులకు అదనంగా ప్రోత్సాహకం అందినట్లు అధికారులు చెబుతున్నారు. సుమారుగా 48597 క్వింటాళ్లకు పైగా పత్తికి మద్దతును మించి ధర పలికినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి కేవలం ఆదిలాబాద్ మార్కెట్‌లోనే కన్పిస్తోంది. మిగితా మార్కెట్లలో 8 తేమ శాతంలోపు పత్తి రావడం లేదని (...మిగతా 6వ పేజీలో)



నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలి

● గజానంద్ (మార్కెట్‌శాఖ ఏడీ, ఆదిలాబాద్)

నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తరలించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలి. ఆదరబాదరగా అమ్మేసుకుంటూ నష్టపోవద్దు. 8తేమ శాతంలోపు ఉన్న పత్తికి అదనంగా ధర కలిసి వస్తుంది. ఆపైగా తేమఉంటే మద్దతు ధర తగ్గుతుంది. రైతులు చిన్నపాటి మెలకువలను పాటిస్తే బాగుంటుంది.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) :ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాఫి ర్యాదుల విభాగంలో ఆయన అర్జీలను స్వీకరించారు. ప్రజలనుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ప్రజలు ఇచ్చే అర్జీలపై అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలన్నారు. దరఖాస్తు దారు డిఫిర్యాదుపై తీసుకున్న చర్యల గురించి తెలియ జేయాలన్నారు. అదే విధంగా సివిల్, భూసంబంధిత, ఉద్యోగాలకు సంబంధించి అర్జీలు ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఇవ్వొదని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: అంకోలి ప్రాథ మిక ఆరోగ్యకేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమ శిబిరాన్ని సోమవారం కలెక్టర్ రాజర్షిషా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకోలి పీహెచ్‌సీలో ఏడో విడత కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతుందని, ప్రతిసంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం ఈనెల 2నుంచి 15వ తేదీ వరకు 14 రోజుల పాటు కొనసాగుతుందని, వైద్యాధికారులు ఆశా వర్కర్లు ఇంటింటి సర్వేచేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి వైద్యం ఇవ్వాలని, దీనికి గ్రామ స్తుల సహకారం తీసుకొని, వ్యాధిగ్రస్తులు గుర్తించి వైద్యం ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ అందరితో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నరేందర్, ప్రోగ్రాం ఆఫీసర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, శ్రీధర్ పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

క్రీడల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. హుజురాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 హాకీపోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం కలెక్టరేట్‌లో క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీవై ఎస్‌వో వేంకటేశ్వర్లు, డీఈవో ప్రణీత, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట ’



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జీసీసీ చైర్మన్

ఆదిలాబాద్ రూరల్ : వైద్యంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, అందులో భాగంగానే అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జీసీసీ చైర్మన్ కోట్నాక్ తిరుపతి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్యదినోత్సవాన్ని నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానం ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా స్థానిక రిమ్స్‌లో అధికారులు వీక్షించారు. కార్యక్రమంలో డీసీసీ చైర్మన్ తిరుపతి, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డీఎంహెచ్‌ఓ నరేంద్ర రాథోడ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి : ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ ఆయన మాట్లాడారు. బీజేపీ అంటేనే క్రమశిక్షణతో కూడుకున్నదని, నాయకత్వంపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటే గెలుపు దానంతట అదే వస్తుందని అన్నారు. ప్రజల కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని అప్పుడే మనతోపాటు పార్టీ కూడా బలపడుతుందన్నారు. సమావేశంలో నాయకులు ఆకులప్రవీణ్, రఘుపతి, జోగు రవి, కృష్ణ యాదవ్, గొర్ల రాము, శ్రీనివాస్, సోమ రవి, సుభాష్, రాకేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి..

లక్ష్యసాధన కోసం దృఢ సంకల్పం, పట్టుదలతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పాయల్‌శంకర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని పద్మశాలి సంఘం భవనంలో పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో (పోప) ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కొలువులు సాధించిన 40 మందిని



ఉద్యోగిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బేత రమేష్, నాయకులు శివకుమార్, లచ్చిరాం, చంద్రమోహన్, తాలూకా అధ్యక్షులు బొమ్మ కంటి రమేష్, ప్రధాన కార్యదర్శి చిలుక విలాస్, పద్మశాలి సంఘం ప్రతినిధులు కటకం రాందాస్, కాసర్ల శ్రీనివాస్, కామన్ విఠల్, బాస దత్తు, రాకేష్ పద్మవార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్, మండల ప్రధాన కార్యదర్శి తుమ్మ రాజు, గాజుల హనుమాన్లు పాల్గొన్నారు.

విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలి

నేరడిగొండ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కుమారి గ్రామంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో న్యూట్రిషన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువు పై దృష్టి సారిస్తారనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. చాలా మంది విద్యార్థులు పోషకాహార లోపం, సరైన విటమిన్లు, ప్రోటిన్లు తీసుకోకపోవడంతో వారిలో ఎదుగుదల లోపిస్తుందని తెలిపారు. పోషకాల ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన అలవాట్లు, రక్తహీనత నివారణ చర్యలు ఏయే ఆహార పదార్థాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారనే విషయాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశాల నిరసన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : ఆశాలకు లెప్రసి, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన ఆశాల లెప్రసి డబ్బులు, 2024లో చేసిన పల్స్‌పోలియో డబ్బులు రాష్ట్ర ప్రభు త్వం నేటికీ చెల్లించలేదన్నారు. కార్యక్ర మంలో నాయకులు, ఆశావర్కర్‌లు పాల్గొ న్నారు.

వంటగదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌రూరల్, డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లోని వంటగది ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగు సూచించారు. ఇటీవల ఫుడ్‌పాయిజన్ ఘటనల నేపథ్యంలో సోమవారం ఆదిలాబాద్‌లోని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో వసతిగృహాల సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వంటలు చేసేటప్పుడు నాణ్యమైన వస్తువులను వినియోగించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు.

జిల్లాపై తుఫాన్ ప్రభావం

ఆదిలాబాద్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా పై తుఫాన్ ప్రభావం కనిపిస్తుంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉంది. దీంతో చలిప్రభావం తగ్గుముఖం పట్టింది. జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 29.0 డిగ్రీలు కాగా కనిష్టంగా 21.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఒకేసారి కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీ పెరుగుదల కనిపించింది. ఆదివారం 9.7కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా గడిచిన 24గంటల్లోనే 21.2డిగ్రీల సెల్సియస్‌గా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే నేరడిగొండలో 18.6, బజార్‌హత్నూర్‌లో 18.8, బోథ్‌లో 19.4, తలమడుగులో 19.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతంకావడంతో పంటలను చీడపీడలు ఆశించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అయితే కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో చలిప్రభావం పెద్దగా కనిపించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ సత్యనారాయణ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 02 (ఆంధ్ర జ్యోతి) : ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమ వారం ఆదిలాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 317 జీవో తో ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీని నియమించిందని, కమిటీ క్షేత్ర స్థాయిలో పలు దఫాల వారీగా సుదీర్ఘ చర్చలు జరిపిన తర్వాత ప్రభుత్వానికి నివేదికను అందిం చిందని తెలిపారు. 217 జీవో కారణంగా ఇబ్బం దులు పడుతున్న వారికి బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి నవీన్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్‌కు మార్, సంఘం నాయకులు సాయికృష్ణ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి చేయండి

● పీఓకు తోటితెగ గిరిజనుల వినతి

ఉట్నూర్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని తోటి గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నందున తోటితెగలు అభివృద్ధి కోసం ఐటీడీఏ ద్వారా కృషిచేయాలని తోటితెగ గిరిజనులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కోరారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల అర్జీలను పీవో స్వీకరిస్తూ వారి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా తోటిగిరిజనులు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను అందరికీ అందించాలని కోరారు. గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. గాదిగూడ గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ గ్రామానికి అంగన్‌వాడీ సెంటర్, సీసీ రోడ్డు మంజూరు చేయించాలని, బేల మండలం బోర్గాం గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. నార్నూర్ మండలం తడిహత్నూర్ గ్రామానికి చెందిన పురుషోత్తం తనకి ఫొటోగ్రఫీ ఉద్యోగం కల్పించామని, ఇంద్రవెల్లి గ్రామానికి చెందిన బాలు తనకు బోర్‌వెల్ మంజూరు చేయించామని కోరారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాలు మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమ ర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ వసంతరావు, ఏపీవో పీవీ టీజీ మేస్రం మనోహర్, సీడీపీవో ఉమాదేవి, పీహెచ్‌వో సందీప్‌కుమార్, డీపీవో ప్రవీణ్, మేనేజర్‌లింగు తదితర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.